# మార్పు




జి. అనసూయ

ఆంటీ గుడికి వెళదాం వస్తారా ఎదుటి ఫ్లాట్‌లో ఉండే ఇందు కాళ్ళ పట్టీలు ఘల్లు ఘల్లుమంటుండగా హడావిడిగా లోపలికి వచ్చింది. చూడగానే తెలిసిపోతున్నది ఏదో విశేషమని [illegible]రున్‌కలర్ పట్టులంగా మ్యాచింగ్ జాకెట్టు బంగారు రంగు ఓణి. పొడవాటి జడకు చివరన జడకుచ్చులు అచ్చ తెలుగు ఆడపిల్ల వేషధారణలో ఇందు.

తనని చూస్తే నాకు ఆశ్చర్యం. వాళ్ల అమ్మా నాన్న అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. ఇక్కడ ఈ పిల్ల బామ్మ దగ్గర ఉంటూ ఎమ్.సి.ఎ చేస్తున్నది. వాళ్ళమ్మవాళ్ళు వందలకొద్దీ ఫ్యాషన్ దుస్తులు పంపిస్తుంటారు. ఈ అమ్మాయేమో శుక్రవారం తలంటుకొని లంగాఓణి వేసుకొని అష్టలక్ష్మి గుడికి వెళుతుంది. కాళ్ళకు పసుపు మెడకు గంధం వరకు ఏ లోపమూ రానివ్వదు సంప్రదాయానికి. వాళ్ళ బామ్మకు కీళ్ళనొప్పులు, నడవలేదు. అందుకే అప్పుడప్పుడు నన్నిలా గుడికి రమ్మంటుంది.

రా....రా.... ఇందూ నీవడిగాక తప్పుతుందా ఇంతకూ ఏమిటి విశేషం... ఇవాళ శుక్రవారం కూడా కాదు అన్నాను రైటింగ్ టేబుల్ దగ్గర్నుండి కదులుతూ..

హాండుబ్యాగు తీసుకొని బయలుదేరుతున్న నన్ను ఆశ్చర్యంగా చూసింది ఇందు.

ఆంటీ మీరెప్పుడూ ఫ్రెష్‌గా బయటకు వెళ్ళడానికి తయారైనట్లే ఉంటారు అంది కాంప్లిమెంటిస్తూ...

అలాగా ఇందూ నీకంటె ఫ్రెష్‌గా ఉన్నానా నేను. చూద్దాం మనం రోడ్డు మీద వెళుతుంటే ఎవరివైపు చూస్తారో జనం అన్నాను నవ్వుతూ. పోండాంటీ... సిగ్గుపడుతూ అంది ఇందు.

గుడికి వెళ్ళడం అంటె తమాషాగా ఉంటుంది నాకు. నాకై నేను ఎన్నడూ గుడికి వెళ్ళను. దేవుడి మీద విశ్వాసం గాని భక్తిగాని లేవు. విన్నవించుకోవడానికి కోరికలూ లేవు. కాని ఇందుతో గుడికి వెళ్ళడం ఓ గొప్ప అనుభూతి. ఈ కాలంలో ఇందులాంటి పిల్లలు అరుదు. పది నిముషాల్లో గుడికి చేరుకున్నాం. పెద్దగుడి చుట్టూ మరెన్నో చిన్న చిన్న గుళ్ళు. అన్ని గుళ్ళ చుట్టూ ఓపిగ్గా ప్రదక్షణలు చేసి వచ్చింది ఇందు. నేనో స్తంభం దగ్గర నుంచొని పరిసరాలు చూస్తున్నాను.

పూజారి చేతికి కొబ్బరికాయ పూలు ఇచ్చి కళ్ళు మూసుకొని దండం పెట్టుకుంది ఇందు. ఏం కోరుకొని ఉంటుంది. మంచి మార్కులు రావాలనా, గొప్ప ఉద్యోగం రావాలనా, మంచి భర్త కావాలనా, నా మనసులో ప్రవాహంలాగా ఆలోచనలు.

ఆంటీ ప్రసాదం తీసుకోండి చేతిలో కొబ్బరిముక్క పూలు చేతిలో పెట్టింది ఇందు.

కొబ్బరిముక్క నోట్లో వేసుకొని పువ్వు ఇందు జడలోనే తురిమాను.

మెట్లు దిగుతున్నాం. మెట్టు మెట్టుకూ యాచకులు. ఇందు పర్సులో ఉన్న చిల్లర తీసి తలా అర్ధరూపాయి ఇస్తూ వస్తున్నది. ఇదంతా దయా, ధార్మికతనా, పుణ్యం వస్తుందనా... సాంప్రదాయం పట్ల విశ్వాసమా... ఇందు మొహంలో కనిపించే ప్రశాంతతకు, నిర్మలమైన ముగ్ధత్వానికి కారణం ఈ అచంచల భక్తి విశ్వాసాలేనా.

ఆఖరి మెట్టు దిగుతుండగా ఓ పలకరింపు.

బాగున్నావా అమ్మా !

ఎవరా అని వెనక్కి చూశాను. అడివమ్మ.

ఓ అడివమ్మా! ఇదేంటి ఇక్కడ నీవు. వరుసగా కూర్చున్న బిక్షగాళ్ళ మధ్య ముందో పాత చీర పరుచుకొని అడివమ్మ. అడుక్కుం టున్నదని అర్ధమై ఆశ్చర్యం కలిగింది.

వెనుక జనం తోస్తుండడంతో పక్కకు వచ్చాను. అడివమ్మ లేచి నా దగ్గరకు వచ్చింది. మనిషి వంగిపోయి పండు ముసలిలా ఉంది. కర్ర సాయంతో కుంటుతూ నడుస్తున్నది.

ఏమిటి అడివమ్మా ! ఇలాగున్నావేంటి అన్నాను...

ఏం చెయ్యమంటరు అమ్మగారూ... యాపారం పొయ్యింది. ఉన్నదంత అమ్మి పిల్లల పెండ్లిల్లు చేసిన. తలా ఓ పని చేసుకుంట ఆడొకరు ఈడొకరు బతుకుతున్నరు. ఈ వయసుల నాకేం పని శాతనైతది అమ్మగారూ. కూసొబెట్టి ఎవరు సాదుతరు. అందుకే ఓపిక ఉన్ననాడు ఇట్ల ఈ గుడికాడ కూసుంట. దయున్న అమ్మగార్లు రూపాయో, అర్ధ రూపాయో ఇస్తే ఇంత దింట. లేకుంటే కడుపులో కాళ్లు పెట్టుకుని పండుకుంట. అంటూ తన గోడు చెప్పుకున్నది అడివమ్మ. ఓ పది రూపాయలు ఆమె చేతిల పెట్టి ఎప్పుడన్న ఇంటికి రమ్మని చెప్పి ముందుకు నడిచాను.


ఇందు గుడి అరుగు మీద కూర్చుని నన్నే చూస్తు న్నది వింతగా ఎవరాంటీ ఆమె. బిక్ష గాళ్ళలో కూడా మీకు ఫ్రెండ్స్ ఉన్నారా అంది నవ్వుతూ.

అలాగే అనుకో ఇందూ. ఆవిడ అడివమ్మ అని ఇంతకు ముందు మన పేటలో కూర గాయలు అమ్మేది. ఇప్పుడేంటో పరిస్థితులు బాగాలేక అడుక్కుంటున్నదంట.

నా మనసులో ఆనాటి అడివమ్మ రూపం మెదిలింది. నుదుటున ఇంత పెద్ద బొట్టుతో చేతుల నిండా ఆకుపచ్చని గాజులు ముదురు రంగు అంచు చీరలు, కుడిపైట వేసుకొని గంపనిండా కూరగాయలు పెట్టుకొని పేటంతా తిరుగుతుండేది. తెల్లారేసరికి అడివమ్మ రాగయుక్తంగా బీరకాయ, బెండకాయ, దోస కాయ, ఆలుగడ్డ, వంకాయ అంటూ పాట లాంటి కేక వినపడగానే ఇండ్లల్లో ఆడవాళ్ళంతా గుమ్మాల ముందు చేరేవాళ్ళు. కొసిరి కొసిరి బేరమాడి ఈ ఒక్కటి కొసరు అనుకో, ఆకాస్త మొగ్గ ఉంటే ఏం పోయిందనో, ఇన్ని కూరలు కొన్నానుగా కొన్ని పచ్చిమిరపకాయలు వెయ్య మనో దబాయించేవాళ్ళు.

అయ్యో గట్లయితే నేనెట్ల బతుకుత అమ్మగారూ, గా ధరకు నాకే వస్తలేవు అంటూనే ఓ గుప్పెడు పచ్చిమిరపకాయలో ఓ కొత్తిమీర కట్టో వేసేది అడివమ్మ.

ఎప్పుడన్నా ఓ రోజు అడివమ్మ రాకపోతే వీధిలో ఏదో వెలితి. మర్నాడు అడివమ్మను చూడగానే ఆప్యాయంగా పలకరింపులు. నేను రోజూ ఆకుకూరలు కొనేదాన్ని. అవసరమున్నా లేకపోయినా అడివమ్మను పిలిచి కాసేపు బేరమాడి ఓ కప్పు చాయ ఇచ్చి ఏ కరివేపాకో తీసుకుని పంపించేదాన్ని.



ప్రక్కనున్న పల్లెటూరు అడివమ్మది. సిటీ దగ్గర కావడాన చుట్టుప్రక్కల పల్లెల్లో అన్ని సీజన్‌లలో కూరగాయలు పండేవి. పొద్దున్నే గంపనిండా కూరగాయలతో వచ్చేది అడివమ్మ. ఆమె గంపలో కూరగాయలు కూడా ఆమె లాగా స్వచ్ఛంగా తాజాగా అమాయకంగా ఉండేవి.

క్రమంగా ఆ పేటంతా పెద్ద కాలనీగా మారిపొయ్యింది. మొదట్లో కొన్ని కొట్లు తెరిచారు. కూరగాయలు కూడా కొట్లల్లో దొరుకుతుండడంతో బయటకు వెళ్ళి వచ్చే ఉద్యోగస్తులు వస్తూ వస్తూ కూరగాయలు కూడా తెచ్చుకోవడం మొదలయ్యింది. అయినా అడివమ్మ కోసం ఎదురు చూసే వాళ్ళకు కొదవ లేదు. ఇంకో పదేండ్లు గడిచేసరికి కాలనీ అంతా ఖరీదైన భవనాలు అపార్టుమెంట్లు మల్టీప్లెక్స్ భవంతులు వెలిసాయి. అన్నీ ఒకచోటే దొరికే సూపర్ బజార్లు షాపింగ్ మాల్స్ వెలిశాయి. సుభిక్ష ఫ్రెష్ అప్ అంటూ పళ్ళు కూరగాయలు కూడా బ్రాండు పేర్లతో అందమైన ప్యాకింగు లలో దొరుకుతున్నాయి. మొదట్లో బజారు కంటె తక్కువ ధరలో వెరైటీగా దొరుకుతుండడంతో ఆ షాపుల్లో కొనడం మొదలై అలవాటుగా మారింది. క్రమంగా అడివమ్మ కూరగాయలు మిగిలిపోవడం మొదలుపెట్టాయి. ఎప్పుడన్నా మిగిలిన కూరగాయలతో మా ఇంటికొచ్చేది. కళకళలాడుతూ ఉండే ఆ మొహం దిగులుతో వెలవెలబోతూ ఉండేది.

ఏమిటీ అడివమ్మా అలాగున్నావంటే

ఏముందమ్మా... కాలనీ అమ్మగార్లకు గంప కూరగాయలు నచ్చకుండాబోయె అంటూ నవ్వేది. చుట్టుప్రక్కల పల్లెల్లో భూముల రేట్లు పెరిగి రైతులంతా భూములు అమ్ముకోబట్టిరి. కూరగాయలు పండడం తగ్గిపోయింది. కూరగాయలకు ఆకుకూరలు కూడ మార్కెట్ల కొని మారుబేరం చెయ్యాలంటే నేనేం జేస్త అంటూ చెప్పుకొచ్చేది అడివమ్మ.

నిజమే ఇంతకు ముందు ఎక్కడ చూసిన పచ్చటి అరటితోటలు, కూరగాయల, పూల తోటలు కనిపించేవి. ఇప్పుడెక్కడ చూసిన నిర్మాణాలు, రియల్ ఎస్టేట్ బోర్డులు కనిపిస్తున్నాయి. ఎక్కడివక్కడ డ్రైనేజీ కాలువలు కూడా మూసేసి కట్టడాలే నిర్మిస్తున్నారు.

ధరొచ్చిందిగదాని రైతులంతా భూములు అమ్ముకునిరి. అడివమ్మ కూరగాయల బేరం మానేసి కొన్నాళ్ళు సీజన్లలో వచ్చే పళ్ళు అమ్మింది. ఆ తరువాత చాలా ఏండ్లు కనపడ లేదు. చాలాఏండ్ల తరువాత ఓరోజు బస్టాండులో కనిపించింది. తలరేగిపోయి పాతచీరలో బక్కచిక్కి ఉంది. ఏమిటి అడివమ్మా కాలనీవైపు రావడం లేదు అంటూ పలుకరించాను. ఇంకేడి వమ్మా కూరలు. మార్కెట్ల పాతసంచులు మాట్లు వెయ్యడానికి పోతున్న రోజుకు ముప్పై రూపాయలు కూలి. కూరగాయలు అమ్మితె అదిగూడ వస్తలేదు గదమ్మ. ధరొస్తుందని ఊర్లె ఇల్లు కూడా అమ్మి ఆఖరు పిల్ల పెండ్లి చేసినం. ఈడ్నె గా ఖాళీ ప్లాట్ల గుడిసె ఏసుకున్నం అంటూ చెప్పింది. ఆతర్వాత ఇదే చూడడం అడివమ్మను.

ఈరోజు నేను చూసిన అడివమ్మ... దీనంగా బిక్షమెత్తుకుంటున్న దృశ్యం నా స్మృతి పథంలోంచి చెరిగిపోవడం లేదు. స్వాభిమానంతో స్వేచ్ఛకూ, స్వచ్ఛతకూ ప్రతీకగా ఉండే అడివమ్మను తన ఊరినుండి, భుక్తి నుండి దూరం చేసిన శక్తులేమిటి? అడివమ్మలాంటి వందలాది చిన్న చితుకు బ్రతుకులకు గమ్యం ఎక్కడ, ఈ మార్పు అనివార్యమా? నా మనసు నిండా జవాబు లేని ప్రశ్నలు..

## నాన్నమ్మ

నా జీవితానుభవాల లైబ్రరీని కోల్పోయాను
దగ్గినా, తుమ్మినా, వొళ్లు వేడి చేసినా
పలసరుకుల్తో వైద్యం చేసిన చరకం
కంఠోపాఠం పట్టలేక గునుస్తున్న బుర్రకి
బెత్తంతో పద్యం నేర్పిన నా అమరం
నా కోసం నిద్రలోనే కాదు
మెలుకువలోనూ కలలుకన్న కార్మికనేత్రం
సగం కోర్కెలకి మనసు వేదిక పైన్నే
రహస్యంగా చితిపేర్చి
నా భవిష్యద్దారిలో కాగడాలు వెలిగించిన
నా ఆకాశదీపం
నాకిప్పటికీ గుర్తే
నేనలిగిన ప్రతిసారీ
నాన్న అమ్మైపోయేవాడు
నా నిద్దర కోసం ప్రతిరాత్రీ
విసనకర్రై వీచేవాడు
కాయకష్టం చేసినవొళ్లు
మనిషి బండయితే కావచ్చు
మా నాన్న మనసు మాత్రం వెన్నముద్ద
జీవితాన్ని నెత్తికెత్తుకున్న తర్వాతే
యిన్ని చింతలూ చికాకులూ గాయాలూ
మానాన్న సామ్రాజ్యంలో
నాపైన ఈగవాలిన దాఖలా లేదు
చిన్నప్పుడెప్పుడైనా సరే
చిగురంతైనా చొక్కా నలిగిందా ?
పిసరంతైనా బుగ్గ కందిందా?
కాలానికి ధన్యవాదాలు చెప్పాలి .
ఈ మాసిన గెడ్డం
ప్రైవేటుద్యోగపు అరవచాకిరీ
కలలు కూలిపోయిన మొండి గోడల బతుకు
చూడ్డానికి ముందే నాన్నని
తనతో కూడా తీసుకెళ్ళిపోయినందుకు !

\- ఈతకోట సుబ్బారావు